
భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


వేల్పూర్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


బోధన్‌లో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, యువకులు


రెంజల్‌లో హనుమాన్ స్వామి వారికి సమర్పించిన మహా నైవేద్యం


తుంగిని హనుమాన్ మందిరంలో..


బోధన్‌లోని మారుతి మందిరంలో..

సాక్షి నెట్‌వర్క్ : ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో గురువారం హనుమాన్ జయంతిని హిందువులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రెంజల్‌లోని అంజన్న ఆలయంలో 108 రకాల వంటలు, పండ్లతో మహా నైవేద్యాలను సమర్పించారు. పాత వర్ని గ్రామంలో వీరభద్ర ఆలయం వద్ద గ్రామస్తులు అగ్నిగుండం నిర్వహించారు. పలు ఆలయాల్లో ఆలయ కమిటీలు, దాతల సహకారంతో భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. వేల్పూర్ హనుమాన్ ఆలయంలో రోడ్లు, భవనాల శాఖమంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆయన సతీమణి నీరజరెడ్డితో కలిసి హనుమంతుణ్ణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీపేట మండలంలోని తుంగిని గోదావరి నదీతీరంలోని పురాతన హనుమాన్ ఆలయంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్ ప్రత్యేక పూజలు చేశారు. బోధన్‌లోని పెద్ద మారుతి మందిరంలో ఆర్డీవో రాజేశ్వర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరహనుమాన్ విజయయాత్ర..

హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా హిందూ సంఘాల నాయకులు, యువకులు కాషాయ జెండాలను చేతబట్టి, ప్రత్యేక వాహనాల్లో హనుమాన్ ప్రతిమలతో ర్యాలీలు నిర్వహించారు. శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్మూర్‌లో శోభాయాత్ర రూట్‌ను ఇన్‌చార్జి సీపీ,నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.


రెంజల్లో హోమం నిర్వహిస్తున్న వీడీసీ సభ్యులు


నందిపేట కేదారేశ్వర ఆశ్రమంలో..


మోర్తాడ్‌లో జ్యోతిని ఊరేగిస్తున్న భక్తులు..


ఆర్మూర్‌లో శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు..


మామిడిపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


మోర్తాడ్‌లో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు


ఆర్మూర్ పట్టణంలో..


మామిడిపల్లి హనుమాన్ ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


ఆలూర్ శోభాయాత్ర నిర్వహిస్తున్న స్వాములు


అభంగపట్నంలో కుస్తీ పోటీ విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ, ఎస్సైలు

అలరించిన కుస్తీ పోటీలు

నవీపేట: మండలంలోని అభంగపట్నం గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీపోటీలు అలరించాయి. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు చెందిన కుస్తీ వీరులు ఈ పోటీలలో తలపడ్డారు. విజేతలకు నగదుతో పాటు వెండి ఉంగరాలు, బ్రాస్‌లెట్లు, కడెంలను అందించారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ఎస్సై రాజారెడ్డి, వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్: పోతంగల్ మండలం కొల్లూర్, రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామాల్లో హన్మాన్ జయంతి సందర్భంగా కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో మహారాష్ట్రతో పాటు వివిధ ప్రాంతాల కుస్తీ వీరులు పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పోటీలు తిలకించడానికి సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు.


అభంగపట్నంలో పోటీపడుతున్న కుస్తీవీరులు


కొల్లూర్ గ్రామంలో..

క్లుప్తంగా

మాక్లూర్ మండల అభివృద్ధికి కృషి



మాక్లూర్: మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని మెట్‌పల్లి, వల్లభాపూర్, చిక్లి, కొత్తపల్లి, ధర్మోరా, గంగారమంద గ్రామాల్లో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాక్స్ బల్బులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వల్లభాపూర్‌లో చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా.. తన దృష్టికి తెస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో క్రాంతి, సర్పంచ్ శిలారి మంజుల సుధాకర్, ఉపసర్పంచ్ గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఉద్యమాన్ని కొనసాగిస్తాం

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా లక్ష్యం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని న్యాయవాదులు అన్నారు. బోధన్ ప్రత్యేక జిల్లా కోసం పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 109వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు అజయ్ కుమార్, బానోత్ రమేష్‌లు కూర్చున్నారు. బార్‌అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

బోధన్: బోధన్ అర్బన్, రూరల్, సాలూర మండలాల్లో మొత్తం 13 పదోతరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం పలు పరీక్షా కేంద్రాలను వర్ని, బాల్కొండ మండలాల విద్యాధికారులు శాంతకుమారి, రాజేశ్వర్‌లు తనిఖీ చేశారని ఎంఈవో నాగ్‌నాథ్ తెలిపారు. 13 కేంద్రాల్లో జరిగిన ఇంగ్లీష్ సబ్జెక్టు పరీక్షకు 2756 మందికిగాను 2748 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

నష్ట పరిహారం అందించాలి



రెంజల్(బోధన్): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి వినతిపత్రం అందించారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు రైతులకు గిట్టుబాటు ధరలను అందించాలన్నారు. సంఘ ప్రతినిధులు పుట్టి నాగన్న, నసీర్, ఒడ్డెన్న, రాజేశ్వర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఇంటింటికీ బీజేపీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 30,31, 32, 36వ వార్డులో గురువారం ఓబీసీ మోర్చా పట్టణశాఖ ఆధ్వర్యంలో 'పల్లె పల్లెకు ఓబీసీ- ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామద్రిభాస్కర్ మాట్లాడుతూ.. బీసీలకు కేంద్ర ప్రభుత్వం చేసిన లాభాలు, బీఆర్‌ఎస్ చేసిన అన్యాయలను ప్రజలకు వివరిస్తు కరపత్రాలను అందజేశామన్నారు. కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్‌కుమార్, కిరణ్, పల్లె శ్రీనివాస్, మీసాల రాజేశ్వర్, ఎంజే రమేష్, పోహార్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు



నందిపేట్ (ఆర్మూర్): ఉమ్మడి నందిపేట్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించుకునే ఫంక్షన్ హాల్ కోసం రూ. 50 లక్షల నిధులు విధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయుసీ చైర్మన్ జీవన్‌రెడ్డి గౌడ సంఘం ప్రతినిధులకు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిపేట గౌడ సంఘం అధ్యక్షులు నాందేవ్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీనివాస్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు సుధాకర్ గౌడ్, అశోక్ గౌడ్, సుభాష్ గౌడ్, భూమ్రాజ్ గౌడ్, సత్య గౌడ్, విఠల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ చేసిన వాహనాన్ని గుర్తించాలి


కోటగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న కొత్తపల్లి తండావాసులు

రుద్రూర్: కొత్తపల్లి తండా యువకుడు లాల్‌సింగ్ మృతికి కారణమైన వాహనాన్ని వెంటనే గుర్తించాలని తండావాసులు డిమాండ్ చేస్తూ గురువారం కోటగిరిలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ప్రమాద ఘటనకు సమీపంలోని సీసీ పుటేజీ డాటా తమకు చూపించాలని వారు డిమాండ్ చేశారు. ఒక రైసమిల్ వద్ద ఎప్పుడు ఉండే వాహనం రెండు రోజులుగా కనిపించక పోవడం, సీసీ పుటేజీ పని చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. త్వరలోనే వాహనాన్ని గుర్తిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

12 రకాల నిత్యావసర సరుకులు అందించాలి


బోధన్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యూ, ప్రజాసంఘాల నాయకులు

భీమ్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణా ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో వారు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భాగ్య, భీమ్‌గల్ మండల కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యంతో పాటు వంటనూనె, పప్పులు, పసుపు, పంచదార, కారం, ఉప్పు, చింతపండు, టీపొడి, సబ్బులు మొదలైన సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలన్నారు.


భీమ్‌గల్‌లో..

బోధన్: పట్టణంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. పీవోడబ్ల్యూ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


పెర్కిట్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు..


మాక్లూర్ మండల కేంద్రంలో..


జానకంపేట గ్రామంలో..

పెర్కిట్/మాక్లూర్/రుద్రూర్/నవీపేట/బోధన్‌టౌన్/బాల్కొండ/ఎడపల్లి: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో గురువారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో బీజేపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని అన్నారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక రాష్ట్ర ప్రభుత్వం పార్టీ నాయకులను అక్రమ అరెస్టులు చేస్తుందన్నారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఇంటింటికి బీజేపీ పోస్టర్లను ఆవిష్కరించారు.


నవీపేట మండల కేంద్రంలో..


బోధన్ పట్టణంలో..


వెంచిర్యాల్ గ్రామంలో..


రుద్రూర్ మండల కేంద్రంలో..

ముగ్గురు అధ్యాపకులకు డాక్టరేట్



మోర్తాడ్/ఆర్మూర్‌టౌన్/వేల్పూర్: మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ముగ్గురికి రాజస్థాన్‌లోని శ్రీధర్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. గురువారం ప్రిన్సిపాల్ పెద్దన్న, ఇతర అధ్యాపకులు వారిని సత్కరించారు. జీవశాస్త్రంలో అర్చన, గణితంలో బ్యూలా పర్స, కామర్స్‌లో అవంతి డాక్టరేట్ సాధించారన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

బోధన్: రాష్ట్రంలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి యానం విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం రాత్రి నిర్వహించిన యూనియన్ డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు కేసులతో సంబంధం లేని ఉపాధ్యాయుల పదోన్నతులను చేపట్టి, గత ఏడేళ్లుగా నిలిచిపోయిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. యూనియన్ వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈవో నాగ్‌నాథ్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగన్న, నాయకులు పాల్గొన్నారు.


బోధన్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

సంక్షిప్తం

జిల్లావాసులకు దళితరత్న అవార్డు



రెంజల్(బోధన్): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా దళిత రత్న అవార్డులను అందించారు. రెంజల్ మండలం కూనేపల్లికి చెందిన రొడ్డ లింగం, నవీపేట్‌కు చెందిన తెడ్డు పోశెట్టిలు అవార్డులను అందుకున్నారు.

బీఆర్‌ఎస్ నేత సురేందర్ రెడ్డికి సన్మానం

వర్ని: మండలంలోని జాకోర గ్రామంలో గురువారం నిర్వహించిన హన్మాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బాన్సువాడ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సురేందర్ రెడ్డిని సర్పంచ్ గోదావరి గణేష్ సన్మానించారు. ఎంపీటీసీ సాయిలు, కలాల్‌గిరి పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ కళ్యాణి ప్రారంభించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఉప సర్పంచ్ జాపు మహేశ్, వైద్యాధికారి గాయత్రి, ఆశావర్కర్లు, అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి(బోధన్):మండలంలోని బాపునగర్‌లో కంటివెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ మేగవత్ సునీత ప్రారంభించారు.హెచ్‌ఈఓ రాములు,రాజుకుమార్, సెక్రెటరీ స్వర్ణలత, ఉపసర్పంచ్ కిరణ్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బోదేపల్లిలో సీసీ రోడ్డు పనులు..

బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ రవిలు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు , వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిపేట్: డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో గురువారం బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.